భానుడు భగ్గుమంటున్నా..



మల్కాపురం కూడలి వద్ద ఎండలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు



శ్రీహరిపురం కూడలి వద్ద ఎండ వేడికి తట్టుకోలేక ముఖానికి క్లాత్ కట్టుకున్న ట్రాఫిక్ పోలీస్

తీవ్రమైన ఎండలో ఓ ఐదు నిమిషాలు నడిచినా, లేదా ద్విచక్ర వాహనంపై వెళ్లినా శరీరమంతా చెమట పట్టి, ఎక్కడ నీడ దొరుకుతుందా? కాసేపు సేద తీరుదామా అనిపిస్తుంది. అటువంటిది మండు వేసవిలో, నడినెత్తిన సూరీడు భగ్గుమంటున్న సమయంలో నీడ కూడా లేని ప్రాంతంలో, వాహనాల కాలుష్యం మధ్య విధులు నిర్వహిస్తుండటమంటే మాటలా? ట్రాఫిక్ పోలీసులు ఈ విధంగానే శ్రమిస్తున్నారు. జంక్షన్లలో వాహనాలను క్రమబద్ధీకరిస్తూ, నగరవాసులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు.

- విధి నిర్వహణలో ట్రాఫిక్ పోలీసులు
- నగరవాసులకు ఇబ్బంది లేకుండా క్రమబద్ధీకరణ చర్యలు

మల్కాపురం: నగరంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తూ నగరవాసులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నారు ట్రాఫిక్ పోలీసులు. ఏ ఒక్క జంక్షన్‌లో ట్రాఫిక్ పోలీసులు లేకపోయినా.. ఇక వాహనచోదకుల ఇష్టారాజ్యం. ఎవరికి వారికే ముందుగా వెళ్లిపోవాలనే తొందర. దీంతో ట్రాఫిక్ జామ్ లేదా ప్రమాదాలు చోటు చేసుకుంటాయి. వీటన్నింటికీ చెక్ పెడుతూ ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపడుతున్నారు ట్రాఫిక్ కానిస్టేబుళ్లు. ఎండావానల్లో సైతం వారు విధులు నిర్వహిస్తూనే ఉంటున్నారు.

మల్కాపురం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మారుతి సర్కిల్, వీడీఆర్ గొడౌన్స్ ఏరియా, డాక్‌యార్డ్ నుంచి గొడౌన్స్‌కు వెళ్లే మలుపు, సింధియా, మల్కాపురం, శ్రీహరిపురం తదితర కూడళ్లు ఉన్నాయి. ఆయా కూడళ్లలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎక్కువ. ప్రధానంగా మారుతి సర్కిల్, శ్రీహరిపురం సర్కిల్ వద్ద వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఆయా కూడళ్లలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు స్టేషన్ అధికారులు బీట్ కానిస్టేబుళ్లను నియమిస్తుంటారు. **అయితే, ప్రస్తుతం ఏప్రిల్ నెలలో పగటి ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలను దాటి ఉంటున్నాయి. రానున్న మే, జూన్ నెలల్లో 42** నుంచి 43 డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు చేరవచ్చని వాతావరణ నిపుణులు తెలియజేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ట్రాఫిక్ పోలీసులు ఎండ వేడిని తట్టుకుని, ఆ జంక్షన్ల వద్ద వాహనాల నుంచి వచ్చే కాలుష్యాన్ని పీల్చుతూ, ఉద్యోగాలు చేస్తుంటారు. ఎండ వేడికి శరీరంపై చిన్నపాటి సూదులతో గుచ్చినట్టు ఉన్నా.. వాహనాల నుంచి వచ్చే పొగతో ఉక్కిరి బిక్కిరిగా అనిపించినా విధులు నిర్వర్తించాల్సిందే. నగర ప్రజల ప్రయాణం సాఫీగా సాగేందుకు శ్రమిస్తున్న ట్రాఫిక్ పోలీసులను తప్పక అభినందించాల్సిందే.



సింధియా సెంటర్ వద్ద ఎండలో విధులు నిర్వహిస్తున్న సీఐ షణ్ముఖరావు, ఇతర సిబ్బంది

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ప్రధాన కూడళ్లలో బీట్ నిర్వహించే కానిస్టేబుల్స్ వడదెబ్బకు గురికాకుండా సమీపంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి.
- కూల్ క్యాప్ తప్పనిసరి.
- బీట్ పాయింట్‌కు సమీపంలో ఫ్యాన్ సౌకర్యం ఉన్న చిన్న తాత్కాలిక షెడ్, ఎండ తీవ్రంగా ఉన్న సమయాల్లో ప్రతీ గంటకు అక్కడ విధులు నిర్వహించే కానిస్టేబుల్‌కు కాస్త విశ్రాంతినివ్వడం, మజ్జిగ ప్యాకెట్లు అందించడం వంటి చర్యలు తీసుకుంటే మంచిది.

కానిస్టేబుల్స్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు



ఎండల్లో ప్రధాన కూడళ్లలో పనిచేసే ట్రాఫిక్ కానిస్టేబుల్స్‌కు కూలింగ్ గాగుల్స్, మాస్కులు, టోపీ వంటి నదుపాయాలను కల్పించాం. దాతల సాయంతో చలివేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నాం. వారికి ఆర్వో వాటర్ వంటి నదుపాయాలతో పాటు, త్వర కూల్ టోపీలను అందించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

– షణ్ముఖరావు, ట్రాఫిక్ సీఐ

భక్తిశ్రద్ధలతో సంకట హర చతుర్థి



వినాయకుడికి పూజలు

మల్కాపురం: సంకట హర చతుర్థి సందర్భంగా బుధవారం పారిశ్రామిక ప్రాంతంలో పలువురు వినాయకుడి భక్తిశ్రద్ధలతో పూజించారు. ఆలయాలతో పాటు ఇళ్లల్లో గణపతి చిత్రపటాలు ఏర్పాటు చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎలాంటి విఘ్నాలు కలగకూడదని మొక్కు కున్నారు. నెయ్యితో కూడిన దీపాలు వెలిగించి,గరిక,తెల్లజిల్లేడు,పలు సుగంధ పుష్పాలతో అర్చన చేశారు.వినాయకుడికి ప్రీతి అయిన ఉండ్రాలు,కుడుములు,చెరకు వంటి పదార్థాలను నైవేద్యంగా సమర్పించారు.

పగలే వెన్నెల



ఫోకస్

జీవీఎంసీ 57వ వార్డు ఐటీఐ జంక్షన్ పరిధి తుమ్మదపాలెం, సుభాష్‌నగర్ రైల్వేట్రాక్ ప్రాంతాల్లో పగటి పూట వీధి లైట్లు వెలుగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో రాత్రి సమయంలో వెలగని వీధి లైట్లు ఇక్కడ పట్ట పగలు వెలగడంతో అటుగా వెళ్లే పాదచారులు, వాహనదారులు ఆశ్చర్యపోతున్నారు. వెలగని లైట్ల కోసం ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు పగటి వెలుగులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- కంచరపాలెం

క్లుప్తంగా

కుటుంబ సభ్యుల చెంతకు జార్ఖండ్ వాసి



కుటుంబ సభ్యులతో నితీష్ కుమార్

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం పొందిన వ్యక్తిని కుటుంబం చెంతకు చేర్చేలా షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. మూడు నెలల కిందట కంచరపాలెం ఫుట్ పాత్ మీద ఒక వ్యక్తి మానసిక పరిస్థితి బాగోక తిరుగుతూ ఉండడం గమనించిన కంచరపాలెం పోలీసులు జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత సమాచారం ఇచ్చారు. ఆమె వెంటనే స్పందించి అతడికి షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. అతని వివరాలు ఆరా తీయడంతో తన పేరు నితీష్ కుమార్ అని, తనది జార్ఖండ్ దగ్గర ఇర్బా పహంతోళి గ్రామం చెప్పాడు. దీంతో షెల్టర్ మేనేజర్ మమత నితీష్ కుమార్‌ను వారి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. ఎక్కడ వెతికినా దొరకని తన కొడుకు ఒక్కసారిగా కళ్ల ముందుకు వచ్చేసరికి ఆ తల్లి కన్నీటి పర్యంతమైంది. తమ బిడ్డను అప్పగించినందుకు షెల్టర్ మేనేజర్ మమతకు ధన్యవాదాలు తెలిపారు.

అప్పల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య



సంతోష్‌కుమార్ మృతదేహం

మల్కాపురం: ఓ వైపు అప్పులు.. మరో వైపు మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు.ఈ ఘటనపై మల్కాపురం సీఐ విద్యాసాగర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.మల్కాపురం దరి ప్రకాష్ నగర్ ప్రైమరీ స్కూల్ ప్రాంతంలో సంతోష్‌కుమార్ (39) అనే వ్యక్తి తన తల్లిదండ్రులతో కొంత కాలం నుంచి నివాసం ఉంటున్నాడు. ఇతనికి భార్య జయశ్రీ, కుమారుడు,కుమార్తె ఉన్నారు. ఈ ఏడాది జనవరి నెలలో ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లిన సంతోష్ అదే నెలలో తిరిగి వచ్చేశాడు.దీంతో పాటు మద్యానికి బానిసైన సంతోష్ తెలిసిన వారి వద్ద అప్పులు చేయడం ప్రారంభించాడు. దీంతో భార్య ప్రశ్నిస్తుండటంతో ఆమెతో వాదనకు దిగేవాడు. భరించలేక ఆమె కొద్ది రోజుల నుంచి పిల్లలతో కలిసి వేరే చోట నివాసం ఉంటుంది. ఇది ఇలా ఉంటే బుధవారం మద్యం సేవించిన సంతోష్ తన గదిలోకి వెళ్లి ఉరి పోసుకున్నాడు. సమయం గడుస్తున్నా కుమారుడు బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు కిటికీ నుంచి చూడగా గదిలో వేలాడుతూ కనిపించాడు. దీంతో వారు కేకలు వేస్తూ రోదించారు. చుట్టుపక్కల వారు వచ్చి జరిగిన ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి ఆత్మహత్యపై ఆరా తీశారు.

ఇంటర్ టాపర్లకు సత్కారం



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

మల్కాపురం: ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాల్లో మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల విద్యార్థినులు చక్కటి మార్కులు సాధించారు.ఈ సందర్భంగా కళాశాల టాపర్లుగా నిలిచిన విద్యార్థులను బుధవారం సత్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రేమకుమారి మాట్లాడుతూ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు 81 శాతం, వృత్తి విద్య కోర్సుల్లో 88 శాతం మార్కులు సాధించారన్నారు. ప్రియాంక పాండే, ప్రజ్ఞ ప్రీతి మహంతి 1000 మార్కులకు 976 మార్కులు సాధించి కళాశాల టాపర్ల గా నిలిచారన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి,ఎ.ఆదిలక్ష్మి,వై.అనసూయాదేవి,ప్రేమలత,సుధ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు అమృతం



ప్ల కార్డులు ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురం ఎస్సీ బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. వెంకటాపురం తదితర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పక్షం రోజుల్లో 1000 రోజుల సంరక్షణ, కంగారు కేర్, పరిసరాల పరిశుభ్రత, పౌష్టికాహారం,తల్లి పాలే బిడ్డకు అమృతం వంటి పలు అంశాల గురించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, ఎంఎస్‌కే దివ్య, సూర్యకళ, శమంత కమణి తదితరులు పాల్గొన్నారు.

నాటక రంగాన్ని బతికించుకుందాం



మాట్లాడుతున్న ఆచార్య నరసింహారావు



గోపాత్రుడు నాటికలోని ఓ సన్నివేశం

విశాఖ విద్య: నాటక రంగాన్ని బతికించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆంధ్రా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు అన్నారు. కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా బుధవారం ఏయూ ఓపెన్ థియేటర్‌లో తెలుగు నాటకం దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కందుకూరి చిత్రపటానికి వర్సిటీ ఆచార్యులతో కలసి నరసింహారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరేశలింగం జయంతిని నాటక రంగ దినోత్సవంగా ప్రకటించడం నాటక రంగానికి గుర్తింపు దక్కినట్లేనన్నారు. కళలకు పుట్టినిల్లు ఉత్తరాంధ్రలో నాటక రంగానికి నేటికీ మంచి ఆదరణ లభిస్తోందన్నారు. టెక్నాలజీ ఎంత పెరిగినా.. సమాజం ఉన్నంత వరకు నాటకం బతికే ఉంటుందని పేర్కొన్నారు. సమాజ ఇతివృత్తాలను కళ్లకు కట్టినట్లుగా చూపించే అవకాశం ఒక్క నాటక రంగలోనే ఉంటుందని చెప్పారు. ఆంధ్రా యూనివర్సిటీలో థియేటర్ ఆర్ట్స్ విభాగానికి పూర్వ వైభవం తీసుకొచ్చేలా తగిన ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలిపారు. అనంతరం ప్రదర్శించిన గోపాత్రుడు నాటిక ఆకట్టుకుంది. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.శశిభూషణ్‌రావు, ఆచార్య ప్రేమనందం, ఆచార్య విజయ్‌మోహన్, ఆచార్య పల్లవి, డైరెక్టర్ డా.కిరణ్‌కుమార్, డా.రాజేంద్రప్రసాద్, పితాని ప్రసాద్, డా.వీర్‌కుమార్, హేమ వెంకటేశ్వరి, దుర్గారావు, సాయిప్రియ తదితరులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా ఆర్వో ప్లాంట్

ఫోకస్

జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం ఎఫ్‌ఆర్‌యూ (30 పడకల ఆసుపత్రి)కి వచ్చే రోగుల దాహం తీర్చుకునేందుకు కోరమాండల్ ఇంటర్ నేషనల్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో నాలుగేళ్ల కిందట ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేసింది. ఆస్పత్రికి వచ్చే రోగులతో పాటు వెనుక గల జీవీఎంసీ ఇంజినీరింగ్ సిబ్బందితో పాటు ఆ కార్యాలయానికి వచ్చే దాహం తీర్చుకునే వారు. అయితే ఆర్వో ప్లాంట్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో గత కొద్ది రోజుల నుంచి పని చేయడం లేదు.దీంతో ప్లాంట్‌కు తాళాలు వేశారు.ఎండలు మండుతున్న సమయంలో ప్లాంట్ పని చేయకపోవడంతో రోగులు ఇబ్బంది పతున్నారు.



- మల్కాపురం

జియో సింథటిక్స్‌తో బహుళ ప్రయోజనాలు

విశాఖ విద్య: జియో సింథటిక్స్ బహుళ ప్రయోజనకరంగా నిలుస్తున్నాయని వీఎంఆర్‌డీఏ చీఫ్ ఇంజినీర్ ఎం.వినయ్‌కుమార్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో బుధవారం నిర్వహించిన ఒకరోజు సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. మానవ మేధస్సు నుంచి జియో సింథటిక్స్ ఉద్భవించిందని, మూడు శతాబ్దాలుగా దీని ప్రాముఖ్యత పెరుగుతూ వస్తోందన్నారు. విశాఖలో చేపట్టిన తొలి ఫ్లైఓవర్ నిర్మాణంలో కూడా జియో సింథటిక్స్ వినియోగించామని చెప్పారు. యువ ఇంజినీర్లు ఈ రంగాన్ని తమ కెరీర్‌గా మలచుకోవడానికి సదస్సు ఎంతో ఉపయోగంగా నిలుస్తుందన్నారు. నిపుణులు సుస్థిర పరిష్కారాలను అందించాలని సూచించారు. మెకాఫెరి సంస్థ బిజినెస్ హెడ్ గిన్లుకా స్పాడారో, ఏయూ సివిల్ ఇంజినీరింగ్ ఆచార్యుడు సి.ఎస్.వి.సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ విశాఖ విమానాశ్రయం రన్‌వే పటిష్టతకు, ఇతర ప్రాంతాల్లో బహుళ నిర్మాణాలు చేపట్టడానికి జియో సింథటిక్ మెటీరియల్స్‌ను వినియోగించామని తెలిపారు. అనంతరం పోర్టుల నిర్మాణం, నేల కోత నివారణ, జాతీయ రహదారులపై డ్రైనేజీల నిర్మాణం, జియో సింథటిక్స్ ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనం, వివిధ ప్రాంతాల్లో జియో సింథటిక్స్ నిర్మాణాలు-వాటి ప్రాముఖ్యతలు, రైల్వే లైన్ ఎయిర్‌పోర్ట్ రన్‌వేల నిర్మాణంలో జియో సింథటిక్ వినియోగం, ఉపయోగాలు తదితర అంశాలపై నిపుణులు ప్రసంగించారు. సదస్సులో పరిశ్రమల నిపుణులు, సివిల్ ఇంజినీరింగ్ ఆచార్యులు వివిధ కళాశాల ఆచార్యులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సు ప్రారంభిస్తున్న వీఎంఆర్‌డీఏ చీఫ్ ఇంజినీర్ వినయ్‌కుమార్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దే భవిష్యత్తు

విశాఖ విద్య: భవిష్యత్తు అంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఆధారంగా నడుస్తుందని ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు పేర్కొన్నారు. ఏయూ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం సంయుక్తంగా బుధవారం నిర్వహించిన బిల్డ్ భారత్ హ్యాక్‌థాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత మేధస్సుకు పదును పెట్టే విధంగా ఈ కార్యక్రమం నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సృజనాత్మకంగా పనిచేస్తూ నూతన ఆవిష్కరణలు జరపాలని సూచించారు. యువత ఇక్కడ నుంచి స్ఫూర్తిని పొంది నూతన అంకుర సంస్థలను స్థాపించేలా అడుగులు వేయాలన్నారు. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య కె.వెంకటరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఏడు రాష్ట్రాల నుంచి 488 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు. యువతను ప్రోత్సహించడం, వారి ఆలోచనల నుంచి అనేక సమాజ ఉపయుక్త పరిష్కారాలను తీసుకురావడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆచార్యులు పాల్గొన్నారు.



బిల్డ్ భారత్ హ్యాక్‌థాన్ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు, ఆచార్యులు

ఘనంగా ముత్యమాంబ తొలేళ్ల సంబరం

- కనులపండువగా ఉత్సవ ప్రతిమల ఊరేగింపు
- నేడు ప్రధాన పండగ

కంచరపాలెం: గవర కంచరపాలెం వాసుల ఆరాధ్య దైవం ముత్యమాంబ అమ్మవారి తొలేళ్ల సంబరాలు బుధవారం రాత్రి ఘనంగా జరిగాయి. అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు గ్రామాభ్యుదయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మళ్ల రామ్‌ప్రసాద్, మళ్ల రమేష్‌గారి ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా నిర్వహించిన తొలేళ్ల ఉత్సవంలో అమ్మవారి ఉత్సవ ప్రతిమల ఊరేగింపు కనులపండువగా సాగింది. భక్తులు తలపై అమ్మవారి ప్రతిమలను పెట్టుకుని జగదాంబ కూడలి, అల్లిపురం, జ్ఞానాపురం, రామ్మూర్తిపంతులపేట ప్రాంతాల మీదుగా కంచరపాలెం పుట్టబంగారం అమ్మవారి మూలవిరాట్ వద్దకు చేర్చారు. ఉత్సవంలో పలువురు ప్రముఖులు అమ్మవారి ఘటాలను తలపై ఉంచి మొక్కు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే గణబాబు వేడుకల్లో పాల్గొన్నారు. ఊరేగింపులో ఒడిశాకు చెందిన బ్యాండ్ సింగారి మేళా, ధూమ్‌దఢాకా, తప్పెటగుళ్లు, విజయనగరం పులివేషాలు, వివిధ జంతువుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. భక్తులు అమ్మవారి కీర్తనలు ఆలపిస్తూ ధూప, దీప నైవేద్యాలు సమర్పిస్తూ, హారతులిస్తూ ముందుకు సాగారు. పాలకవర్గ సభ్యులు ఉత్సవ కమిటీ సభ్యులు పనులు పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



అమ్మవారి ఘటాల ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు

ఏర్పాట్లు పూర్తి

కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ కూడలిలో వెలసిన ముత్యమాంబ ఆలయంలో గురువారం ప్రధాన జాతర నిర్వహించనున్నారు. గురువారం తెల్లవారుజాము నుంచి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఆలయాన్ని సుందరంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ప్రసాదాలు, మజ్జిగ, శీతలపానీయాలు అందించేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోపాలపట్నం: గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ ఒక ప్రకటనలో తెలిపారు. బాజీ జంక్షన్, రెడ్డి వీధి, సుసర్ల కాలనీ, జయప్రకాష్‌నగర్, ఎస్సీ కాలనీ, విద్యానగర్, రవీంద్రనగర్, రైల్వే స్టేషన్ ప్రాంతం, నాయుడు క్వార్టర్స్ ప్రాంతాల్లో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

స్టీల్‌ప్లాంట్ సీఎండీని కలిసిన సీఐఎస్ఎఫ్ డీఐజీ

ఉక్కునగరం: సీఐఎస్ఎఫ్ సౌత్ జోన్-2 డీఐజీ అపరాజిత మహాపాత్ర బుధవారం స్టీల్‌ప్లాంట్ ఇన్‌చార్జ్ సీఎండీ అజిత్‌కుమార్ సక్సేనాను కలిశారు. విశాఖ పర్యటనకు వచ్చిన డీఐజీ ఉక్కు పరిపాలన భవనంలో సీఎండి సక్సేనాతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సీఐఎస్ఎఫ్ యూనిట్ సిబ్బంది గురించి చర్చించారు. స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ యూనిట్ నూతన కమాండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన జితేంద్ర బాబు దువ్వాడ కూడా మొదటి సారి సీఎండీను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

రోడ్లపై వ్యర్థాల డంప్!

ప్లాస్టిక్ నిషేధం అంతంత మాత్రమే



దుకాణాల్లో చెత్త ఇలా రోడ్డుపైకి..

గోపాలపట్నం: దుకాణాల్లో వ్యవర్థాలను రోడ్లపై వేస్తున్నారు. పగలు అధికారులు దృష్టిలో పడకుండా ఉండేందుకు నిల్వ చేసి సాయంత్రం అవగానే రోడ్డుపై పడేసి పోతున్నారు. ఇది పాదచారులకు ఇబ్బందిగా మారుతోందని వాపోతున్నారు. దుకాణదారులు, తోపుడు బళ్ల వారు వ్యర్థాలను దగ్గర్లో ఉండే డంపర్ బిన్లలో వేయాలి. కాని నిర్లక్ష్యంగా రోడ్లపైనే డంప్ చేస్తున్నారు. గాలులు వీస్తే చాలు ప్లాస్టిక్ కవర్లు, సంచులు పైకి ఎగురుతూ ప్రయాణికులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ప్రతి దుకాణదారుడు తప్పనిసరిగా డస్ట్ బిన్ వాడాలని, వ్యాపారం అయిన తర్వాత వ్యర్థాలను దగ్గర్లో ఉన్న డంపర్ బిన్లలో మాత్రమే వేయాలని అధికారులు చెబుతున్నా పట్టించుకోవడం లేదు.పాలిథిన్‌ను కూడా ఇష్టానుసారంగా వినియోగిస్తున్నారు. ఇలా రోడ్లపై వేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గోపాలపట్నం మెయిన్‌రోడ్డుతో పాటు దుకాణాలు, ఫుడ్ సెంటర్ల వద్ద రోడ్లపై వ్యర్థాలు గుట్టలుగా కనిపిస్తున్నాయి.



జ్యూస్ సెంటర్, బేకరి వాళ్లు వేసిన వ్యర్థాలు



సప్తగిరి జంక్షన్ వద్ద ఖాళీ మద్యం సీసాలు

మద్యం సీసాలు సైతం

సప్తగిరి జంక్షన్ వద్ద మద్యం సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులు భారీగా పడేశారు. ఇవి సమీపంలోని వైన్స్ షాపు నుంచి వచ్చినవేనని పలువురు ఆరోపిస్తున్నారు. రాత్రి విధులకు వచ్చే పారిశుధ్య కార్మికులు శుభ్రం చేస్తారని ఇలా పడేస్తున్నారని చెబుతున్నారు.

అప్రమత్తతతో అగ్నిప్రమాదాలకు చెక్



పెదగంట్యాడలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక దళ సిబ్బంది

పెదగంట్యాడ: అప్రమత్తతతో అగ్ని ప్రమాదాలు అరికట్టవచ్చునని అగ్నిమాపక జిల్లా అధికారి ఎన్. గోపీకృష్ణ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పెదగంట్యాడ, గాజువాక పరిసర ప్రాంతాల్లో అగ్ని మాపక దళ సిబ్బందితో కలసి బుధవారం ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజాగ్రత్త వల్లే అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు ఎలా నివారించాలనే అనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాంటి సమయంలో ఆస్తి నష్టం, ప్రాణనష్టం వాటిల్లకుండా సకాలంలో సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రమాదాలు సంభవించినపుడు మంటలను ఏ విధంగా అదుపుచేస్తారో ప్రయోగాత్మకంగా ప్రదర్శన ద్వారా తెలియజేశారు.